# "ముఖసిరి"

పంచముఖేశ్వరరావు ముఖసిరి ఎట్లాంటిదోగాని ముప్పైఏళ్ళ దాటినా, సంసారం చేస్తూ తండ్రి అయినా కూడా ఒక్కలాగే వుంది.

కొందరి ముఖాలు చూస్తే ఆనందం కలుగుతుంది.

మరికొందరి ముఖాలు చూస్తే జాలికలుగుతుంది.

కొందరిని చూస్తే పలకరించాలనే బుద్ధి పుడుతుంది.

ఇంకా కొందరి ముఖాలు చూస్తే తిట్టబుద్ధీ, కొట్టబుద్ధీ కలుగుతుంది. ఆ ముహాన్ని యీడవాల ననిపిస్తుంది!

ఇదిగో ఇలాంటి బాపతులోదే మన పంచముఖి (ముద్దుగా) ముఖం... అదేం ఖర్మమో!

ఒకనాడు పక్కింటి ఆవిడ ఆమె భర్తని అడిగిందట—

"ఏమండీ ఎందుకలా ఎప్పుడూ ధుమధుమలాడుతూ మొహం పెట్టుకుంటారూ?"—అని దానికి ఆయన అన్నాడట—

"నా మొహం ఏం జూసావూ మన పొరుగింటి పంచముఖేశ్వర వుగారి మొహం చూడూ!" అని.

చెప్పొచ్చేదేమిటంటే— కొందరి ముఖాలకి ఎక్కడికి వెళ్ళినా యం లభిస్తుంది మరికొన్ని మొహాలకి ఎక్కడకు వెళ్ళినా, అవమా అపజయం వస్తుంది. ఈ రెండో తరగతికి పేరు పొందిన వాడు ముఖి.

ఇంట్లోనే కాదు, పైనా బంధువర్గంలో కూడా! అందు కేమనేం చేస్తారు! నిదర్శనంగా కొన్ని సంఘటనలు ఉండనే వున్నాయి.

పువ్వు పుట్టగానే పరిమళించినట్టు— చిన్నప్పుడే—అయిదారేళ్ళ వున్నప్పుడు ఎవరో బంధువులింట్లో పెళ్ళికి తరలి వెడుతూ వుంటే— మహానుభావుడయిన పంచముఖి పుటుక్కున్న తుమ్మాడు... "హాచ్ఛీ! హాచ్ఛీ!" అని.

ఆ చాదస్తం పెళ్ళివారు, ఆ బండి మారి, మరో బండిలో వెళ్ళ వచ్చుని ఆగిపోయారు! "అయ్యో! అయ్యో!!" అంటూ.

మరికొన్ని గంటలోనే కబురు-ఏ బండిలోనయితే వెళదామను కున్నారో ఆ బండీ, మధ్యదారిలో పడిపోయిందని— మరి బళ్ళు నడవ వని—

ఇంక చూడండి...వీడి తుమ్ము వల్ల వెళ్ళలేదు కాబట్టి ప్రాణాలు దక్కాయని—వాళ్ళు సంతోషించలేదు! మీదుమిక్కిలి, వీడు తుమ్మబట్టే ఆ బండి పడిపోయిందనీ పెళ్ళికి వెళ్ళలేక పోయామనీ, అఘాండం ఆ పసి వాడి మీద పడేసి ఆ తర్వాత ఎప్పుడు ఆ ప్రస్తావన వచ్చినా పంచముఖికి పుష్కలంగా ఆశీర్వచనాలు లభించేవి!

మరొకమారు కూడా ఈ విధంగానే పెళ్ళికి వెళ్ళడం జరిగింది— అప్పటికి మన చిట్టి వాడికి పది పన్నెండేళ్ళుంటాయి. ముహూర్తం ఇంకో గంట వుండనగా పంచముఖేశ్వరరావు ఫ్రెండ్సుతో సహా వీధుల్లో తిరుగు తున్నాడు అలా పెద్ద వీధి ప్రక్కనుండి వస్తూండగా—

అక్కడ ఒక స్కూలు మాస్టరు ఇంకెవరితోనో మాట్లాడు తున్నాడు. అలా వెళుతున్న పంచముఖిని చూసి పిలిచాడు—అతను పంచ ముఖికి కూడా బాగా తెలుసు— వాళ్ళ స్కూలులోని టీచర్.

"ఏవిరా ఇలా వచ్చావ్ !" అని అడిగారు.

"మా బాబాయి వాళ్ళింట్లో పెళ్ళికదండీ అందుకు వచ్చా !" అని చెప్పాడు.

"అరె! అయితే పెళ్ళి అయిపోతూందన్నమాట! వాళ్ళకింకా ఈ కబురు తెలియదు కాబోలు." అని సస్పెన్స్‌లో వుంచి చెప్పాడు.

"ఏ కబురండీ!" అని అడిగాడు పంచముఖి.

"ఆదేరా! మీ బాబాయి పెత్తండ్రి పోయాడటగా!" అని అతడు అనేలోపున లోపలనుండి ఆయన భార్య వచ్చి-

"మీ కెందుకు? మీరిలా రండి!" అని చెయ్యి పట్టుకు లాక్కెళ్ళింది ఇంట్లోకి.

పంచముఖి నిశ్చేష్టుడయి-తెప్పరిల్లి గబగబా వెళ్ళిపోయాడు.

పెళ్ళివారిల్లు పెళ్ళివారి సందడితో, మంగళవాద్యాలతో, మంత్రోచ్చారణలతో, కోలాహలంగా వుంది. ఆ కబురు కాస్తా తన తల్లితో చెబితేగాని తోచలేదు పంచముఖికి.

వెనకా ముందూ ఆలోచన లేకపోయినా, మంచీ చెడూ తెలుసు వాడికి. మెల్లగా, రహస్యంగా తల్లిని ఓ మూలకు పిలిచి ఊదేశాడు. తల్లికూడా ఏం చెయ్యడానికీ తోచక పైకి చెప్పడానికి అది సమయం కాదని-

"మరెక్కడా అనకురా! అక్షింతలు మనకి పడతాయి!" అని కొడుకు నోరు నొక్కింది. కాని—

మరెవరు విన్నారో ఏమోగాని, అలా అలా నిముషాలమీద పెళ్ళి పెద్దకు తెలిసి పోయింది.

ఆ చావు కబురు పంచముఖీ మోసుకు వచ్చాడని కూడా గుప్పుమంది!

ఆ శుభవార్త కాస్త ఎక్కడ వచ్చేస్తుందో, కార్యం ఎక్కడ ఆగిపోతుందో అని భయపడుతూనే తొందర, తొందరగా తంతు జరిపిస్తున్న ఆ పెళ్ళిపెద్ద కుప్పకూలిపోయాడు! అతడు భయపడినదంతా అయింది. అయిదేళ్ళయి జబ్బుతో ఉన్న ముండా కొడుకు-కోసం ఎవరు ఎన్నాళ్ళు పెళ్ళిళ్ళు ఆపుకుంటారు? అలాగే-

"ఒక పెళ్ళైనా ఆపకండానే చస్తానా ?" అని కాబోలు అప్పుడే కనిపెట్టుకు ఉండి మరీ చచ్చాడు...ఈ అప్రాచ్యపు వెధవ పంచముఖి ఎలా మోసుగు వచ్చాడో యీ కబురు...కొంప ముంచాడు.

"అయ్యో ! భగవంతుడా? యీ చేసిన సన్నాహమంతా గంగలో కలిసినట్టేనా? ఎంతఖర్చు! ఎంత అభాసు? మళ్ళీ మగపెళ్ళివారి మనసులు మారకండా వుంటాయా?" అని గోలుగోలు మన్నాడు, పంచముఖి మీద పడి కొట్టినంత చేశాడు.

మరో పావుగంటలోనే పోస్టుమాన్ టెలిగ్రాం తెచ్చి ఇచ్చాడు. ఎర్ర సైకిలుమీద...అయినా సరే...అదో విష అయిపోయింది. పంచ ముఖి దానికి కారణం అన్నారు!...వాడివల్లే పెళ్ళి ఆగిపోయిందన్నారు అందరూ !

"పెళ్ళికి వెళుతూ పిల్లిని చంకబెట్టుకొచ్చినట్టు—ఈ అపశకునపు పక్షిని తీసుకు వస్తే ఏమవుతుంది !" అని ఆడిపోసుకున్నారు. దానితో పంచముఖికి మరపురాని పేరు వచ్చేసింది ! నిజానికి—

పంచముఖి, చెప్పినా చెప్పకపోయినా—టెలిగ్రాం వచ్చేకయినా పెళ్ళి ఆగిపోవలసిందే కదా ! అయినా ఏ పాపం ఎరుగని పంచముఖి దానికి కారణమయ్యాడు !

కొంచెం సిగ్గుపడ్డా చిన్నతనం కాబట్టి ఆ దూషణ భూషణాదులన్నీ టిసి తనకు కావనుకొని దులిపేసుకున్నాడు ! అయినా మనసులో బాధ పడ్డాడు.

వాడు పుట్టిన వేళావిశేషమూ, అదృష్టమూ అలాంటివంటే చెప్ప లేంగాని, పంచముఖి స్వతః ఉత్తి దద్దమ్మకాడు...తెలివి తక్కువవాడు అంతకన్నా కాడు !

ముఖం ఎలాటి దిచ్చినా, పంచముఖికి—గొంతుకమాత్రం బంగారం లాంటి దిచ్చాడు భగవంతుడు ! సినిమాలలో బ్యాగ్రౌండు పాడవలసిన వాడే గాని అదృష్టం లేకపోవడంచాత అలా వుండిపోయాడు !—

ఇప్పుడు పంచముఖి పెద్దవాడయేడు ! అంతో ఇంతో నౌఖరీ చేసు కుంటూ పన్రబతుకుతను బ్రతుకు తున్నాడు. అయినా ఆ వచ్చిన పేరు మాత్రం నల్ల జీడిమచ్చలాపోలేదు! బంధువులలోనూ, స్నేహితులలోనూ— అతని తెలివితేటలకు గాని, గొప్పతనానికి గాని రాణింపులేదు. అతనెంతలా మాట్లాడినా, ఎంత మర్యాదగా మాట్లాడినా, ఎంత గౌరవంగా వుందా మన్నా ఎవరూ మెచ్చుకోరు.

సభల్లోనూ, నాటకాల్లోనూ, అతను పాడుతూవుంటే పైవాళ్ళందరూ ఓహో, అని మెచ్చుకుంటారు. ఎన్నోసార్లు రేడియోలోకూడా లలిత సంగీత ప్రోగ్రాము లిచ్చాడు. ఎంతోమంది మెచ్చుగుంటూ అభినంద నలు తెలిపారు! అయితేనేం దగ్గర వాళ్ళందరూ "వాడి ముఖం...వాడికి పాటేమిటి? గార్ధభ స్వరం వీడూనూ!" అనేసారు చులాగ్గా.

ఈ వచ్చిన చెడ్డపేరును ఎలా సరిదిద్దుకుందామా ! అని ఆలోచిం చక పోలేదు పంచముఖి. అందుకే అందరితోనూ ఎంతో జాగ్రత్తగా మసలడానికి ప్రయత్నిస్తాడు !

అలాగే తన ఇంటికి వచ్చిన ప్రతి బంధువునీ తన శక్త్యానుసారం మర్యాద చేస్తాడు. తను క్రింద పడుకుని వచ్చిన వారికి మంచాలువేస్తాడు. సాయంత్రం ఆరుగంటల బండికి వెళ్ళవలసిన వారిక్కూడా అయిదు గంటలకే భోజనాలు పెట్టి, రాత్రికి ఫలహారాలుకూడా ఇచ్చి మరీ పంపు తాడు!...కాని ఏం లాభం? అతను ఎవరింటికయినా వెళితే, కనీసమర్యా దలకు కూడా నోచుకోడు!

తన ఇంట్లోతిని, మర్యాదలు చేయించుకున్నవాళ్లే ఇతని మొహం చూసేసరికి ఏమనిపిస్తుందో ఏమో నిర్లిప్తంగా—

"వీడూ ఒక మర్యాద చేయవలసిన మనిషేనా ?" అనుకొని నిర్లక్ష్యం చేస్తారు.

పోనీ చిన్నతనంలోనయితే ఏమో అనుకుందికి. ఇప్పుడు పంచ

ముఖి పెద్దవాడయినాడు. ఒక ఇంటివాడయినాడు. ఇంకా ఆ చూపే చూడాలా?" అని అనుకుంటూ వుంటాడు.

చుట్టపు చూపుకి ఎప్పుడో వెళితే వీధి వరండాలో క్రిందని చాప వేసి పడుక్కోబెట్టిన అన్నదమ్ములూ-రాత్రి ఏడుగంటల బండికి అతను ప్రయాణం అవుతూంటే తన కొడుక్కి భోజనం పెట్టి-ఎదురుగా పంచ ముఖి కూర్చొని వున్నా కూడా మాటవరసకయినా భోజనం చేస్తావా ? అనయినా అడగని మేనత్తలూ, ఉదయం పది గంటలకు చూద్దామని వెళితే—

"కాఫీకి టైముకాదు...భోజనానికి వుండమన్నా వుండవు !" అని తప్పించుకొనే అక్కయ్యలూ, వీళ్ళందర్నీ తలుచుకొని—అందరికీ ఇలానే కనిపించాలా అని తననితానే నిందించుకోక ఏం చేస్తాడు?

కారణం ఏమిటో బోధపడలేదు. ఎప్పుడయినా ఎందుకిలా జరుగుతూంది అనుకుంటే-

తన తల్లీ, భార్య కూడా "నీ ముఖసిరి అంతేరా?" అనిఅంటారు. తనని తను ప్రశ్నించుకున్నా...అంతే అనిపిస్తుంది మరి !